క్లుప్తంగా

ఘనంగా దోసాలమ్మ జాతర

బిక్కవోలు: కొమరిపాలెంలోని దోసాలమ్మ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

భజేనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



వడిశలేరులోని భజేనారాయణస్వామి

రంగంపేట: మాఘ మాసం మూడో శనివారం సందర్భంగా వడిశలేరులో ఉన్న శ్రీదేవి-భూదేవి సమేత భజేనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మలకమ్మ్రి మురళీకృష్ణమాచార్యులు స్వామి, అమ్మవార్లను తెల్ల చామంతులతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయిబాబా మందిర వార్షికోత్సవం

అనపర్తి: స్థానిక శేషగిరిరావుపేటలోని సాయిబాబా మందిరం 21వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం వేకువజామున సాయినాథునికి క్షీరాభిషేకం, దివ్య అలంకరణ జరుగుతాయన్నారు. ఉదయం 8.30 నుంచి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి, వాస్తు, నవగ్రహ హోమాది క్రతువులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి, పురవీధుల్లో బాబావారి పల్లకీ సేవ జరుగుతాయని తెలిపారు. అనంతరం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని బాబా వారికి ప్రత్యేకంగా కోవాతో తయారు చేసిన కేక్‌ను కట్ చేస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

ట్రాఫిక్ సమస్య



వంతెన మధ్యలో నిలిచిన లారీ

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని మసీద్ వంతెన వద్ద తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. మసీద్ వద్ద వంతెన ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ గ్రామంలోని ప్రవేశించడానికి ఈ వంతెన ఒక్కటే మార్గం. అయితే తొస్సిపూడి-బలభద్రపురం రొడ్డు కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతుండంతో భారీ వాహనాలు పందలపాక మీదుగా వస్తున్నాయి. దీంతో వంతెన వద్ద వచ్చే సరికి చాలా ఇబ్బందిగా ఉంది. శనివారం వంతెన మధ్యలోకి భారీ బియ్యం లోడుతో వస్తున్న లారీ సాంకేతిక కారణం వల్ల నిలిచిపోయింది. దీంతో రాకపోకలు నిలిచాయి. దీంతో స్థానికులు వచ్చే వేసవి కాలంలో వంతెన వెడల్పు చేయాలన్నారు. అప్పుడే గ్రామంలోని ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతుందని గ్రామస్తులు కోరుతున్నారు.

బీసీలు సంఘటితం కావాలి



సుభద్రంపేట బీసీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రంగంపేట: మండలంలోని బీసీలందరూ సంఘటితం కావాలని బీసీ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, గురజారపు వీరభద్రరావులు పిలుపు నిచ్చారు. సుభద్రంపేట గ్రామంలో శనివారం బీసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలోను బీసీలు ఎక్కువ శాతం మంది ఉన్నారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా రాజకీయంగా, సామాజికంగా బీసీలకు సరైన న్యాయం జరగడంలేదన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఐక్యంగా ఉంటే మనకు దక్కాల్సిన గౌవరం మనం సాధించుకో వచ్చని వివరించారు. అందువల్ల ఏ కులంలో ఉన్నా బీసీలంతా సంఘటితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగంపేట మండల బీసీ సంఘం అధ్యక్షుడు కేతా సత్తిబాబు, మండల స్థాయి బీసీ నాయకులు పాల్గొన్నారు.

నలుగురి అరెస్టు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని శివారుల్లో కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు శనివారం తెలిపారు. రాబడి సమాచారం మేరకు దాడి చేయగా వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.760 నగదు స్వాధీనం చేసి కొని వారి అరెస్టు చేసినట్టు తెలిపారు.

మొక్కజొన్న సాగు.. భలే బాగు



- మెట్టలో 9,850 ఎకరాల్లో పంట
- పెరిగిన సాగు విస్తీర్ణం

మధురపూడి: మొక్కజొన్న సాగుకు మెట్ట ప్రాంతం ప్రసిద్ధి. ఇక్కడ ప్రతి ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. పుష్కలంగా నీరు అందుతుండడంతో సాగు సిరులొలుకుతోంది.. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలాల్లో ఆరుతడి నేలల్లో రెండో పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. రైతన్నలకు ఇది లాభదాయకంగా ఉండటంతో 9,850 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగుతోంది. గతంలో 5,500 నుంచి 6,500 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే సాగయ్యేది. ఇందులో సీడ్, కమర్షియల్ రకాలతో పాటు, స్వీట్ కార్న్ రకాన్ని కూడా పండిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం కావడంతో డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉంటే రబీ సీజన్‌కు కూడా పుష్కలంగా సాగునీరు అందిస్తుండడంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుతోంది. రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవతో పుష్కర కాలువ ద్వారా నీరు పంటలకు అందుతోంది. దీంతో మొక్కజొన్న సాగు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరుగుతోంది.

మంచి లాభదాయకంగా..

మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉండటంతో రైతన్నలు ఎక్కువగా మొగ్గ చూపుతున్నారు. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో 9,850 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతోంది. ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తే సరాసరిన రూ.60 వేల నుంచి రూ.78 వేల ఆదాయం వస్తోంది. సీడ్ రకం ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తే మూడు టన్నుల దిగుబడి వస్తోంది. దీనికి రూ.78 వేల ఆదాయం వస్తుంది. కమర్షియల్ రకానికి సరాసరిన 25-30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రూ.60 వేల ఆదాయం రావడంతో లాభదాయకంగా ఉంటుంది. స్వీట్ కార్న్ రకంలో 20 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రూ.50 వేల ఆదాయం వస్తోంది.

మునగాలలో కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

స్వీట్‌కార్న్ మరింత శ్రేష్టం



మొక్కజొన్నలో స్వీట్‌కార్న్ రకం శ్రేష్టమైన ఆహారం. దీనిని ప్రజలు ఎక్కువగా తింటుంటారు. పౌష్టికాహారంగానూ ఉండడంతో దీనికి డిమాండ్ పెరుగుతోంది. దీనివల్ల స్వీట్ కార్న్ రకం సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. – ఎ.గౌరీదేవి, వ్యవసాయ శాఖ, కోరుకొండ మండల అధికారి

సాగు విస్తీర్ణం పెరిగింది



శ్రీరంగపట్నం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, నల్లగొండ తదితర గ్రామాల్లో కమర్షియల్ పంట సాగవుతోంది. గుమ్ములూరు, బుచ్చెంపేట, మునగాల, కూనవరం తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోంది. తక్కువ పెట్టుబడి కావడం, ఆదాయం అధికంగా వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. – అడపా వీరవెంకట సత్యశివ (బాబి), సీడ్ ఆర్గనైజర్, కోరుకొండ

ఎమ్మెల్యే చొరవతో..



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. పుష్కర నీటిని విడుదల చేయడంతో రైతులకు మేలు జరిగింది. లేకుంటే చెరువులు, బోర్లపైనే ఆధారపడాల్సి వచ్చేది. రైతులకు ఇచ్చిన మాటను ఎమ్మెల్యే నిలుపుకొన్నారు. – నాగా గోవిందు, రైతు నాయకుడు, మునగాల

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



పందలపాకలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పందలపాకలో గడపగడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం పందలపాక గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు పొందిన ప్రభుత్వం పథకాలు లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారించడానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అవినీతి, మోసం,అబద్ధాలతో సాగిందని, ఇప్పుడు మళ్లీ తాను అధికారంలోకి వస్తే ప్రజలకు మరింత మేలు చేస్తానన్ని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలోని జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీలు కర్రి గీతాస్రావితి, మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, మండల సచివాలయం కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, సచివాలయం కన్వీనర్ కర్రి సతీష్, కొంకుదరు పీహెచ్‌సీ కమిటీ సభ్యులు యాసలపు శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు పడాల దుర్గారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పడాల వీరాఘువరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి



అచ్చయ్యపాలెంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అచ్చయ్యపాలెంలో గడప గడపకూ..

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల అభ్యున్నతికి దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం సీతానగరం మండలం చీపురపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు కరపత్రాలను అందజేసి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్తుంటే ప్రజలు పథకాల అమలు పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే తిరిగి రావాలని అంతా కోరుకుంటున్నారని అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పాలన చేరువైందన్నారు. గ్రామంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ గోపిశెట్టి అనురాధ, ఉప సర్పంచ్ ఆనుమిల్లి వీరవెంకట సత్యనారాయణ (బుజ్జి), ఎంపీటీసీ సభ్యుడు బిడిసే లక్ష్మి, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గోపిశెట్టి తులసీరామ్, గోపిశెట్టి అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

సినీ బృందం సందడి



విద్యార్థినులతో సెల్ఫీ తీస్తున్న హీరోయిన్ అవికా గోర్

రాజానగరం: తూర్పుగానుగూడెంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హీరోయిన్ అవికా గోర్ సందడి చేసింది. తాను నటించిన 'పాప్‌కార్న్' సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో సాయి రోనక్, దర్శకుడు మురళీ, నిర్మాత బి.గుప్తాలతో కలసి శనివారం సాయంత్రం ఇక్కడకు వచ్చి, సినిమా ప్రత్యేకతను వివరించారు. విద్యార్థినులతో కలసి సెల్ఫీలు తీసుకుంటూ, ఆట పాటలతో అలరించారు.

దిశ, పోక్సో చట్టాలపై అవగాహన



విద్యార్థులకు దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివనాగబాబు

గోకవరం: దిశ, పోక్సో చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గోకవరం ఎస్సై యువి శివనాగబాబు సూచించారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం హెచ్ఎం సీహెచ్ ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై శివనాగబాబు విద్యార్థులకు దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ పి.చిన్ని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

రాజానగరం: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు, నందరాడ సొసైటీ చైర్‌పర్సన్ పంపన శ్రీను అన్నారు. నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేసి, ఏర్పాటు చేసిన రోబోటిక్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తంగెళ్ల మునలయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పి.గోపి, పి.శివన్నారాయణ, పి.రాంబాబు, హెచ్ఎం ఎస్.ఉషారాణి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో బీసీలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ బీసీ సంఘ రాష్ట్ర కన్వీనర్ దుర్గానరేష్ యాదవ్

రాజమహేంద్రవరం సిటీ: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేంద్ర ప్రభుత్వ విధానాలతో అడుగడుగునా అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక వీఎల్ పురంలో గాండ్ల, తెలుకుల సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఈ నెల 8, 9 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. కేంద్ర బడ్జెట్ బడా వ్యాపారులు, అగ్రవర్ణాలను పెంచి పోషించేలా ఉందన్నారు. బడ్జెట్ ద్వారా బీసీల వెన్నెముక విరిగేలా చేసిన కేంద్ర ప్రభుత్వం దిగొచ్చే వరకూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీ సంఘంలోని కొందరు ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న నరవ గోపాలకృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు తానే ప్రకటించానని, ఆ తరువాత తప్పు తెలుసుకుని ఆర్.కృష్ణయ్య తదితర నేతలతో చర్చించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీ సంఘానికి చెడ్డపేరు తెచ్చే నాయకులు ఏ పార్టీలో ఉన్నా వారిని పక్కకు తప్పిస్తామన్నారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల సీతారత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ భవానీ గణేష్, పిల్లా నివాస్, బీసీ యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్‌కుమార్, అంకం గోపి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం రఘుదేవపురంలో భవన నిర్మాణ కార్మికుల కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు ఏ అవసరం వచ్చినా జక్కంపూడి కుటుంబం అండగా ఉంటుందన్నారు. రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు పూర్తి చేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. భవిష్యత్‌లో అదనపు నిధులు అవసరమైతే తన వంతు సహకారం అందిస్తానని రాజా అన్నారు. అనంతరం అక్కిన కోటేశ్వరరావు నిర్మించిన కైలాసగిరి వరకూ తారు రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ చంద్రలీల, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గెద్దాడ త్రిమూర్తులు, యలమాటి కాశీ, పంతుల శ్రీను, దాసరి బాబి, పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఔన్నత్యాన్ని పెంపొందించాలి



కన్నడంలోకి అనువదించిన 'యజ్ఞ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'ప్రాచీన తెలుగు సాహిత్యం, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలు' అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ తెలుగు భాషకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందన్నారు. ఈ సదస్సులలో భాషలోని వివిధ కోణాలను, సాహిత్య, చారిత్రక, సామాజిక నేపథ్యాలను వక్తలు, పరిశోధకులు వివరించారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు తరచూ నిర్వహిస్తూ తెలుగు వెలుగులు ప్రపంచానికి విస్తరింపజేయాలన్నారు. ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ ఈ మూడు రోజుల సదస్సులో పరిశోధకుల నుంచి 90 వరకూ పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సంచాలకులుగా, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ సదస్సులో డాక్టర్ తరపట్ల రచించిన 'యజ్ఞ' అనే వాస్తవిక వచన కవిత్వాన్ని కన్నడ భాషలో డాక్టర్ ఎ.మునిరాజా అనువదించగా, దానిని పుస్తక రూపంలో ఆవిష్కరించారు. భారతీయ భాష డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య సీవీ శివరామకృష్ణ, తెలుగు విభాగ ప్రతినిధులు డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, బి.వెంకటేశ్వర్లు, నూజిళ్ల శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.సుధారాణి, డాక్టర్ జె.మధ్యాన (తెలంగాణ), డాక్టర్ నూనె అంకమరావు (నెల్లూరు) పాల్గొన్నారు.

సంజీవిని కిట్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల, బూరుగుపూడి, నర్సాపురం తదితర గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులకు అక్షయ సంజీవిని కిట్లు శనివారం పంపిణీ చేశారు. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, పప్పు, తదితర నిత్యావసరాలను బాధిత కుటుంబాలకు అందజేశారు. కొన్నేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహించడం అభినందనీయమని సర్పంచుల సమాఖ్య కోరుకొండ మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, గాడాల వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు అన్నారు.

సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం మహిళల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ప్రారంభించారు. దీనికి యూనివర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి 55 మంది క్రీడాకారులు హాజరు కాగా ఇందులో ప్రతిభ చూపిన 16 మందిని ఎంపిక చేశారు. వీరు చండీఘడ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంపీఈడీ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ బాలసత్యనారాయణ, స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ డాక్టర్ బి.రామగోపాల్, సెలక్షన్స్ కమిటీ సభ్యులు మోజిస్‌బాబు, నారాయణ, దావూద్‌ఖాన్, హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ



బలభద్రపురం జగనన్న భూ హక్కు పత్రాలు అందజేస్తున్న నాయకులు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. శనివారం సచివాలయం-2 వద్ద ఇటీవల పంట పొలాలు సర్వే చేసి రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలను సర్పంచ్ బుంగా రామారావు అందించారు. ఈ కార్యక్రమంలోని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, వీఆర్వో మాచవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి తీర్థం

రంగంపేట: వడిశలేరు గ్రామంలో గూనపల్లి వారి వీధిలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక తీర్థ మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ప్రతిరూపమైన విభూది పండును నిర్వాహకులు గూనపల్లి సత్యవతి, తిరుబాబు ప్రత్యేక పూజలు, చేసి ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటం, స్వామి వారి ప్రతి రూపమైన విభూతి పండును పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు.


175 క్యూసెక్కుల నీరు విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి పుష్కర-2 నుంచి ఒక మోటారు ద్వారా నీటిని విడుదల చేశామన్నారు.

7న ఆక్వా సాగుపై గ్రామసభ

పెదపూడి: గ్రామ సచివాలయంలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఆక్వా సాగుపై గ్రామసభ నిర్వహించనున్నారని మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.ప్రకాశ్, సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చొదరి తెలిపారు. వారు శనివారం మాట్లాడుతూ గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో ఆక్వా జోన్లు సాగు చేయడానికి అనుకూలంగా ఉందని, మరికొన్ని చోట్ల లేదన్నారు. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ గ్రామ సభకు హాజరుకావాలని కోరారు.

సంపర వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా పంచామృతాభిషేకాలు చేశారు. మాఘమాసంలో ఏడు శనివారాల వ్రతం పూజల్లో భాగంగా రెండో శనివారం స్వామి వారికి విశేష, తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులు స్వామివారి వ్రతాలను ఆచరించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మెక్కులు చెల్లించుకున్నారు. భక్తులు గోవిందనామాల పారాయణం చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు.

చంద్రబాబు పర్యటనకు రావాలి

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలో ఈ నెల 15న జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. గోకవరంలో శనివారం ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి వాహనంపై రోడ్డు మార్గాన మండలంలోని గుమ్మళ్లదొడ్డి మీదుగా గోకవరం చేరుకుని స్థానిక ఠాణా సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం జగ్గంపేటలో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంగరౌతు రామకృష్ణ, పాలూరి బోసుబాబు, కన్నబాబు, అడపా భరత్‌బాబు, గునిపే భరత్ తదితరులు పాల్గొన్నారు.